

ఉపాధ్యాయులకు డిజిటల్ టెక్నాలజీపై శిక్షణ

నెల్లూరు : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ఎస్ గంగాభవాని లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనటువంటి మొట్టమొదటిగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ డిజిటల్ టెక్నాలజీ అందించాలని సంకల్పించిన ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక, వినూత్న మార్పులు తీసుకు వస్తున్నదన్నారు. గత విద్యా సంవత్సరంలో బైజూస్ ట్యాబ్లు ఇవ్వడం ద్వారా డిజిటల్ టెక్నాలజీ అడుగులు వేసిందన్నారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఉషారాణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 423 పాఠశాలల్లో 1324 ఐ. ఎఫ్. పిలు 428 స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారిణి లక్ష్మీ ప్రసన్న, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి సుధీర్ బాబు, మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ ఉన్నారు.

నా తల్లి కష్టం.. ఏ తల్లికీ రానివ్వను..!

◆మహిళల వంక కన్నెత్తి చూడాలంటే భయపడేలా చేస్తాం
◆నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలుచేసి రక్షణ కల్పిస్తాం
◆"మహాశక్తితో లోకేష్"

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

"నా తల్లికి జరిగిన అవమానం ఏ తల్లికీ రానివ్వనని టిడిపి యువనేత నారా లోకేష్ అన్నారు. సోమవారం నెల్లూరు పట్టణంలోని అనిల్‌గార్డెన్‌లో జరిగిన 'మహిళాశక్తితో లోకేష్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 2024లో ఎన్నికల ఫలితాల్లో టిడిపి లీడింగ్‌లో ఉందన్న వార్తలు వెలువడే సమయంలోనే రాష్ట్రంలో మహిళలపై అరాచకాలు ఆగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కడపకు చెందిన 10రూపాయల డాక్టర్ నూరిఫర్వీన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఎన్‌టిఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు మినహా ఎప్పుడూ ఇంటి నుంచి బయటకు రాని నా తల్లిని శాసనసభ సాక్షిగా అవమానించారని, ఎపి చరిత్రలో తొలిసారిగా రాజకీయాలు ఇంతలా దిగజారి పోయాయన్నారు. నెలరోజులపాటు మా అమ్మ మానసిక క్షోభ అనుభవించిందన్నారు. ఇప్పటికీ వైసిపి నాయకులు అవమానిస్తూనే ఉన్నారని, అధికారంలోకి వచ్చాక నా తల్లికి జరిగిన అవమానం మరో తల్లికి, చెల్లికి జరగనీయనన్నారు. మహిళలను అవమానించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. . నిర్భయ చట్టాన్ని అమలుచేయడం ద్వారా పటిష్టమైన రక్షణ కల్పిస్తామన్నారు. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి మహిళలకేం న్యాయం చేస్తారన్నారు. 145రోజుల సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకున్నాకే మహాశక్తి కార్యక్రమాన్ని మహానాడు సాక్షిగా చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలిఏడాదిలోనే ఈ కార్యక్ర మాన్ని అమలుచేసి తీరుతామన్నారు. అప్పులు చేయడం ద్వారా కాకుండా అభివృద్ధి ద్వారానే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నది టిడిపి సిద్ధాంత మన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దడమే టిడిపి లక్ష్యమన్నారు. మహిళలను గౌరవించాలన్న ఆలోచన మనసులో రావాలన్నారు. ఇందుకోసం కెజి నుంచి పిజి వరకు మహిళలను గౌరవించాలనే ప్రత్యేక పాఠ్యాంశాలు తెచ్చి, సామాజిక చైతన్యం తెచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు.చట్టసభల్లోకి విద్యా వంతులను ఎన్నుకోవడం ద్వారా చాలావరకు సమస్యలు పరిష్కారం అవుతాయని, అందుకే తెలుగుదేశం పార్టీ విద్యావంతులు, ఇంజినీర్లు, డాక్టర్లు, పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పిస్తుం దన్నారు. అధికారంలోకి వచ్చాక మద్యాన్ని నియంత్రించి, సామాజిక చైతన్యం కల్పిస్తా మన్నారు. అంగన్ వాడీలకు జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పాత ఫీజు రీయింబర్స్ మెంట్ విధానాన్ని పునరుద్దరించి పీజీ విద్యార్థులకు వర్తింపజేస్తామన్నారు. రాష్ట్రంలో వివిధ కళాశాలల్లో ఫీజు బకాయిల కారణంగా నిలచిపోయిన సర్టిఫికెట్లను వన్ టైమ్ సెటిల్ మెంట్ ద్వారా విద్యార్థులకు అందజేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమాలను జోడెడ్ల బండిలా కొనసాగించి, ప్రపంచంలోనే రాష్ట్రాన్ని నెం.1గా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తామన్నారు. జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి భారీగా మహిళలు ఈ సభకు వచ్చేశారు. మహిళలు అడిగిన ప్రతి ప్రశ్నకు ఒప్పిగ్గా సమాధానం చెప్పారు. పాదయాత్ర సోమవారం జరగలేదు. ఇప్పటి వరకు జరిగిన సెల్ఫీ విత్ లోకేష్ ద్వార ప్రతి రోజు వెయ్యిమందికి సెల్ఫీలు ఇచ్చే ఆయన నెల్లూరు నగరంలో 2,500 మందికి ఒప్పిగ్గా సెల్ఫీలిచ్చారు.

మహిళా శక్తి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేత నారా లోకేష్

బీద రవిచంద్రను పరామర్శిస్తున్న నారా లోకేష్

'బీద'కు లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను టిడిపి యువనేత, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను నారా లోకేష్ పరామర్శించారు. మంగళవారం రాత్రి మాగుంట లే అవుట్‌లోని బీద రవిచంద్ర నివాసానికి వెళ్లారు. అనిల్ గార్డెన్స్‌లో విశ్రాంతి తీసుకుంటున్న లోకేష్ బీద రవిచంద్రను పరామర్శించారు. గత నెల 13వ తేదీన పాదయాత్ర జిల్లాలోకి వచ్చిన సమయంలో జిల్లా సరిహద్దు వద్ద బీద రవిచంద్ర కాలుకు గాయమైంది. అప్పటి నుంచి ఆయన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంట్లో ఉంటూ యువగళాన్ని పర్య వేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ రవిచంద్రతో గంటపాటు వివిధ అంశాలపై చర్చించారు. యువగళం జరుగుతున్న తీరు, జిల్లాలో రాజకీయ అంశాలను చర్చించినట్లు తెలిసింది. లోకేష్ వెంట మాజీ మంత్రి పి నారాయణ తదితరులు ఉన్నారు.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నెల్లూరు

ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు తక్షణమే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పి. నరసింహ, ఎం.వి. రమణ మాట్లాడుతూ ప్రిలిమ్స్ పరీక్షలు జనవరి చివరిలో నిర్వహించి ఎంఎల్సి ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసిందన్నారు. ఎన్నికలు ముగియగానే నిరుద్యోగులను ముఖ్యంగా ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. మరో ఆరు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఈవెంట్స్ నిర్వహించి ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు ఎన్నికల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల గడుస్తున్న ఈవెంట్స్ నిర్వహించకపోవడంతో అభ్యర్థులు తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణతైన అభ్యర్థులను కలుపుకొని విద్యార్థి యువజన సంఘాలు సంయుక్తంగా చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వంకదారి శ్రీని వాసులు, జగదీష్, బాబు, ఫయాజ్, కుమార్, వెంకటేష్, శీను, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

వైసిపిలోకి ఆనం జయకుమార్..!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి నేత ఆనం జయకుమార్‌రెడ్డి వైసిపిలో చేరారు. మంగళవారం తన సోదరుడు మాజీ డిసిసిబి ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తాడేపల్లిలో చేరారు. ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించి కండువా కప్పారు. పార్టీ విజయానికి కృషిచేయాలని, పార్టీ సముచిత స్థానం ఇస్తుందని చెప్పినట్లు తెలిసింది. ఆనం కుటుంబంలో జయకుమార్‌రెడ్డి ఒక్కరే ఎలాంటి అదికారిక పదవులు అనుభవించలేదు. ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు కాంగ్రెస్‌లో ఉన్న సమయంలోనే జయకుమార్‌రెడ్డి టిడిపిలో చేరారు. కొద్ది కాలం పార్టీలో తిరిగారు. ఆయన సోదరుడు రామనా రాయణరెడ్డి వైసిపిలో చేరగా, ఆయన టిడిపిలోనే ఉన్నారు. మరో సొదరుడు విజయ కుమార్‌రెడ్డి వైసిపిలోకి వెళ్లి డిసిసిబి అధ్యక్షులుగా చేశారు. ఆయన సతీమణి అరుణమ్మ ప్రస్తుతం జెడ్‌పి ఛైర్మ న్‌గా కొన సాగుతున్నారు. ఇటీవల ఆనం రామనారాయణరెడ్డి టిడిపిలో చేరారు. కొద్ది రోజులుగా మౌనంగా ఉన్న జయకుమార్‌రెడ్డి ఊహించని విధంగా వైసిపిలో చేరారు. ఒకప్పుడు ఒకే మాట, బాటగా ఉన్న ఆనం సోదరులు ఇప్పుడు తలో పార్టీలో చేరి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన ఆనం జయకుమార్‌రెడ్డి

నేడు నగరంలో యువగళం..!

టిడిపి భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర నేడు నెల్లూరు నగర నియోజకవర్గంలో సాగనుంది. అందుకోసం ఆపార్టీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి చేసిన ఏర్పాట్లకు పోటీగా నెల్లూరు టిడిపి అభ్యర్థి పి.నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. హెలికాప్టర్, లేదా డ్రోన్లు ద్వార పాదయాత్రకు పూలవర్షం కురిపించడానికి ఎస్‌పికి లేఖ రాశారు. ఇప్పటి వరకు అనుమతి లభించలేదు. నార్త్, సౌత్ ఇండియా నుంచి పది రకాల వాయిద్యాలు తీసుకొస్తున్నారు. 146వ రోజు మంగళవారం మధ్యాహ్నం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అనిల్‌గార్డెన్ నుంచి యాత్ర ప్రారంభమవుతోంది. మూడు వేల మంది మహిళలతో వీడ్కోలు పలకనున్నారు. 4.30 గంటలకు కెవిఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో స్థానికులతో మాట్లాడు తారు. 5.40 ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్థానికులతో మాటామంతీ జరుగుతుంది. 6.00 నెల్లూరు సిటీ నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేసిస్తుంది. విఆర్‌సి జంక్షన్‌లో భారీ బహిరంగ సభ. ఏర్పాటు చేశారు. అక్కడే ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. అక్కడ నుంచి శివ ప్రియ హోటల్ , రాయాజి స్ట్రీట్, గాంధీబొమ్మ, కనకమహల్, సుభాష్ చంద్రబోస్ విగ్రహం, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, పెన్నా బ్రిడ్జి మీదుగా వెంకటేశ్వరపురం మీదుగా సాలుచింతల వద్ద కోవూరు నియోజకర్గంలో ప్రవేశిస్తారు. సాలుచింతల వద్ద విడిది కేంద్రం ఏర్పాటు చేశారు. నెల్లూరు సిటీ అభ్యర్థి పి.నారాయణ దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు. పాదయాత్ర సాగే ప్రాంతం పసుపు జెండాలతో నిండిపోయాయి. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధ్వర్యంలో భారీ జనసమీకరణ సాగుతోంది.

'స్పందన' అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :జగనన్నకు చెబుదాం (స్పందన) అర్జీలపై ప్రత్యేక దష్టి సారించి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డిఆర్ఓ వెంకటనారా యణమ్మతో కలిసి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ విద్యాధరి,జడ్‌పి సీఈవో చిరంజీవి, డిఆర్డిఏ, మెప్మా, ఐసిడిఎస్ పిడిలు కె. సాంబశివారెడ్డి, రవీంద్ర, సౌజన్య, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం. పెంచలయ్య, డిపిఓ సుస్మిత, ఇరిగేషన్ ఎస్ ఈ కష్ణమోహన్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి ఉన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

కార్పొరేషన్ కార్యాలయంలో..

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు సంతప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్యాలయంలోని ఎ.పి.జె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ను నేరుగా మాట్లాడారు. అనంతరం ప్రజలనుంచి నేరుగా 24 అర్జీలను కమిషనర్ స్వీకరించారు.

ఎస్‌పి కార్యాలయంలో...

ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి వేదికగా 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎస్‌పి. డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 99 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ యువతీయువకులకు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నగదు వసూలు చేసి మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అటువంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లోతైన దర్యాప్తు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామ న్నారు. అడిషినల్ ఎస్‌పి (అడ్మిన్), ఎస్‌ఈబి,ఎస్సి,ఎస్టి సెల్,డిటిసి, ఏఆర్ విభాగాల డిఎస్‌పిలు పాల్గొన్నారు.

'నాడు -నేడు' పనులపై సమీక్ష

నెల్లూరు :బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, బడి బయట ఉండ కూడదని, అందరూ బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సంభందిత అధి కారులను అదేశించారు. సోమవారం మన -బడి, నాడు నేడు, జగనన్న విద్యా కానుక,ఐఎఫ్‌పి , డిజిటల్ బోర్డ్స్, తదితర అంశాలపై డి ఇ ఒ,ఎం. డి. ఒ లు, ఎం ఇ ఒ లు, మునిసిపల్ కమిష నర్లు, సంభం దిత ఇంజినీరింగ్ అధికారులతో శంకరన్ హాల్ లో వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి గంగా భవాని, సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ ఉషారాణి, ఎస్‌ఈ అశోక్ ఉన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు

పొదలకూరు :మండల వ్యాప్తంగా గురు పౌర్ణమ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సాయి బాబా, వెంకటేశ్వర స్వామి ఆలయాలకు వేకువ జామున నుంచే భక్తులు పోటెత్తారు.

డిగ్రీ పరీక్షలకు 477 మంది గైర్హాజరు

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన నాలుగో సెమిస్టర్ డిగ్రీ పరీక్ష లకు 477 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్. ప్రభాకర్ తెలిపారు. 4, 450 మంది విద్యార్థులకు గానూ 3980 మంది హాజరయ్యారు.

నేడు 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాకుటూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల మేరకు కందుకూరు పట్టణంలో లలిత బ్రాండ్ బియ్యం వ్యాపారం చేసుకుంటున్న బోనాల శ్రీనివాసరావు అలియాస్ వాసు (55) తన వ్యాపారానికి సంబంధించిన డబ్బులు వసూలు నిమిత్తం వలేటివారిపాలెం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తన స్కూటీపై వెళ్తుండగా, కాకుటూరు సమీపంలోని శ్రీ వెంకటేశ్వర పాలడెయిరీ ఎదురుగా రోడ్డుపై తన వాహనం అదుపు తప్పింది. దీంతో కిందపడటంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతుడి భార్య కాంచనమాల ఫిర్యాదు మేరకు వివిపాలెం ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : అప్పుల బాధ తాళలేక ఒక వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శింగమనేనిపల్లె గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన యనమల వెంకటేశ్వర్లు (46) అనే వ్యక్తి అప్పుల సమస్యతో బాధపడు తున్నాడు. ఇటీవల పొగాకు ముఠాకు సంబంధించి వచ్చిన డబ్బులు సైతం తన సొంతానికి ఉపయోగించుకున్నట్లు తెలిసింది. తిరిగి కూలీలకు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో, వారు అడుగుతారనే భయంతో గ్రామంలోని బాశం శ్రీనివసరావుకు చెందిన పొగాకు బ్యారన్‌లో ఉరి వేసుకున్నట్లు మృతుడి భార్య యనమల రమాదేవి వివిపాలెం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని జగనన్న కాలనీల్లో నీటి అవసరాలకు ఇబ్బందులు లేకుండా, త్వరితగతిన బోర్లు ఏర్పాటు చేయాలని, నిర్ధేశించి లక్ష్యం మేరకు క్షేత్రస్థాయిలో పనులు జరగాలని కలెక్టర్ ఎంహరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలు, హౌసింగ్ డిఇలు,ఎఇలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల తో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కందుకూరు : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు మాట్లాడారు. రాష్ట్రంలో పేదలపై మరో పెను భారం విద్యుత్ రూపంలో వచ్చిం దన్నారు. ఇప్పటికే ప్రజలకు తెలియ కుండా మూడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారిన, ట్రూ ఆఫ్ ఛార్జీలు , సర్ ఛార్జీలు పేరుతో పేద ప్రజలపై పెనుభా రాలు మోపుతు న్నారని విమర్శించారు. సిపిఎం పట్టణ నాయకులు ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రభుత్వ రంగాలను ప్రయివేటు పరం చేస్తూ పేదలపై పెనుభారాలు మోపుతూ పేదలు కనీసం జీవించటానికి వీలులేని పరిస్థితుల్లో రాష్ట్రం నెలకొందన్నారు. రైతు నాయకులు కే మాధవరావు, బొల్లినేని నాగేశ్వరావు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాలకొండయ్య ఏఐటి నియోజకవర్గ కార్యదర్శి ఆనంద్ మోహన్ దుర్గాప్రసాద్ , మాధవరావు, కొండయ్య, కోటేశ్వరరావు, బాల బ్రహ్మచారి, సిపిఎం నాయకులు మున్వర్ సుల్తానా, రామ్మూర్తి, వెంకట్రావు రైతు నేత సుధాకర్ ఉన్నారు.

ధర్నా చేస్తున్న , సిపిఎం, సిపిఐ నాయకులు

లోకేష్‌ను కలిసిన శివరాం

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రలో లోకేష్ బాబును నెల్లూరులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలిపారు. శివరాం మాట్లాడుతూ యువగళం పాదయాత్ర కందుకూరు నియోజ కవర్గంలో ఉండేవిధంగా చూడాలని లోకేష్ బాబును కోరారు. అనంతరం లోకేష్ బాబుతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. లోకేష్‌ను కలిసినవారిలో కందుకూరు నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు దివి సౌభా గ్యమ్మ , నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఉన్నారు..

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో జాతీయ స్థాయి మేనేజ్మెంట్ మీట్ -2023ఈ నెల 12న తేదిన యూనివర్సిటీలోని ఎంబిఎ డిపార్ట్మెంట్ వారు నిర్వహిస్తున్న ఫౌంటైన్ హెడ్ యొక్క పోస్టర్లను యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సుందరవల్లి ఆవిష్కరించారు. ఉపకులపతి మాట్లాడుతూ ఈ జాతీయస్థాయి మేనేజ్మెంట్ మీట్ కార్యక్రమంలో అన్ని కళాశాల నుండి డిగ్రీ మరియు పీజీ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామ చంద్ర రెడ్డి , కన్వీనర్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ చెంచు రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు

ప్రజాశక్తి -గుడ్లూరు

2022 నుంచి 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ. లక్షా 17వేల అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ అధికారులు సోమవారం తెలిపారు. స్థానిక ఎన్ఆర్జిఎస్ కార్యాలయం ఆవరణంలో ప్రజా వేదిక సభ జరిగింది. మండలంలోని మొత్తం గ్రామాల్లో సుమారు రూ.17 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయన్నారు. పనులకు సంబంధించి రూ. 15. 83 లక్షల మేర ఉపాధి హామీ పనులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. మోచర్ల గ్రామంలో తక్కువ రోజులు పని చేయించి ఎక్కువ రోజులకు కూలి చెల్లించినట్లు తేలిందని అధికారులు తెలిపారు. వందరోజుల పని దినాలకు సంబంధించి 67 రోజులు మాత్రమే పని కల్పించినట్లు అధికారులు తెలిపారు. మోడల్ అధికారులు పర్యవేక్షణ ఉండాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ అక్రమాలపై పొట్లూరు సర్పంచ్ పి సుబ్బరాజు, పూరేటిపల్లి సర్పంచ్ గలిపినేని వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ చెరుకూరు సూర్యం అధికారులపై ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో అక్రమాలకు సంబంధించి రికవరీ చేయాలని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ లని అధికారులు ఆదేశించారు.

నిందితులు అరెస్టు

రూ.10లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలు చేసి తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు ఘరానా నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10లక్షల విలువ చేసే 7 మోటారు సైకిళ్లు, బంగారు ఆభరణాలు, ఒక శ్యాంసన్ ఎల్ఈడి టివిలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వేదాయపాళెం పిఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి , వేదాయపాళెం పోలీసు స్టేషన్ సిఐ వెంకట నారాయణలు దొంగల అరెస్టు, సొత్తు స్వాధీనం తాలుకా వివరాలు మీడియాకు వివరించారు. వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న వరుస మోటారు సైకిళ్ల చోరీలకు సంబంధించి కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో నగర డిఎస్‌పి పర్యవేక్షణలో వేదాయపాళెం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా రూరల్ మండల పరిధిలోని నాగామా కాలనీ ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ ఖలీల్ అలియాస్ అబ్బు, ప్రకాశం జిల్లా, సిఎస్‌పురం మండల ప్రాంతం, కొండరాజుపల్లి గ్రామానికి చెందిన కొండరాజు సురేష్ ప్రయాణిస్తున్న వాహనానికి ఎటువంటి ఆధారాలు చూపకపోగా పొంత లేని సమాధానాలు ఇవ్వడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేశామన్నారు. పోలీసులు జరిపిన విచారణలో షేక్ ఖలీల్‌కు గత నేర చరిత్ర ఉందని, రౌడీషీట్ సైతం ఉందని గుర్తించామన్నారు. మరింత లోతుగా విచారణ చేయగా పలు ఇళ్లలో దొంగతం చేసిన 10 సవర్లు బంగారు ఆభరణాలు, ఒక ఎల్ఈడి టివి, పలు ప్రాంతాల్లో దొంగలించిన 7 మోటారు సైకిళు ఉన్నట్లు గుర్తించి ఆ సొత్తును స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను కనపరిచిన ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, మహేష్, మస్తాన్, నాగరాజు, చిన్నబాబు, శ్రీనివాసరావులకు రివార్డు అందజేశారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సోమవారం సంతపేట ప్రాంతంలోని సిపిఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. జిల్లా కన్వీనర్ షేక్ మున్నా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఆర్.బి.కె కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులు(ఏహెచ్ఏ) భర్తీ చేయాలని, గ్రూప్ 1,2, పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుని ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రతి నిరుద్యోగి కి నిరుద్యోగ భతి నెలకు 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వాహనాల మధు, బాదుల్లా అల్తాఫ్ గౌస్ కాజా తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కావలి : ప్రమాదవశాత్తు తన రొయ్యలగుంతలో మేత వేసేందుకు వెళ్లి, విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఆక్వా రైతు వాయిల సోమయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త ఇస్కల సాయి ప్రసాద్ ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీలోని పెదనట్టు గ్రామానికి చెందిన వాయిల సోమయ్య, తను సాగు చేసుకుంటున్న రొయ్యలగుంతకు మేత వేయడానికి వెళ్లి ప్రమాద వశాత్తు కరెంట్ షాక్ తగిలి చనిపోవడంతో ఆయన కుటుంబం విచ్ఛిన్నమైందన్నారు. అసలే అంతుచిక్కని వైరస్ వల్ల సాగు బడి సంక్రమంగా లేక అటు కుటుంబ పోషణ, ఇటు ఖర్చుల భారంతో రొయ్యల గుంతను ఆర్థిక ఇబ్బందులతో సాగు బడి చేసుకోనున్న సన్నకారు రైతు సోమయ్య కుటుంబంను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఆయనకు కలిగిన ఇద్దరు కుమార్తెల విషయంలోనూ, విధవరాలైన భార్యకు ప్రభుత్వ పరంగా అందించే పథకాలను కూడా అందించి తక్షణమే విద్యుత్ శాఖ ద్వారా నష్ట పరిహారం అందించాలన్నారు. అకస్మాత్తుగా కరెంట్ షాక్‌తో చనిపోయినా వాయిల సోమయ్య కుటుంబంను ఆదుకోవాలని కోరారు.

చెత్తబుట్టలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో చెత్తను సేకరించే పారిశుధ్య కార్మికులకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, జెసిఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి చెత్తబుట్టలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, ఎఇ ప్రసాద్, ఆర్‌ఐ ఖాసీం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పేదలందరికీ ఇళ్లు పథకం కింద వాసిలి గ్రామంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను సోమవారం హౌసింగ్ డిఇ నటరాజన్, ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణం త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ ద్వారా బోరు మోటర్ వేయిస్తామని తెలిపారు. కాబట్టి తద్వారా ఇళ్లకు అవసరమైన నీటి సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. సచివాలయ సిబ్బంది వలంటీర్లు కూడా రోజు ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచనలు అందజేయాలన్నారు. కాంట్రాక్టర్ దశరథ రామిరెడ్డి, లబ్ధిదారులున్నారు.

స్పందనకు మూడు అర్జీలు

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఆనందరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 3 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ స్పందనలో ఇళ్ల స్థలాలకు సంబంధించి రెండు అర్జీలు, కంప్యూటర్ అడంగల్ డిజిటల్ సంతకం కోసం ఒక అర్జీ వచ్చిందని తెలిపారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

చిట్టిబాబు కుటుంబానికి 'యువనేస్తం' అండ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ పరిధిలోని కడనూతల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ చినపోయిన దళిత కుటుంబానికి చెందిన కొడిరెక్కల చిట్టిబాబు కుటుంబానికి సోమవారం కాండ్ర యువనేస్తం అండగా నిలిచింది. ఈ సందర్భంగా గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర కార్యదర్శి బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ కాండ్ర యువ నేస్తం సహకారంతో బోగోలు మండలంలో చందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న కాండ్ర సతీష్ నాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీట్ల ప్రత్యూష్ కుమార్, రాజా, జగదీష్, హరినాథ్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం పుల్లారెడ్డి నగర్ నివాసులు కోడూరు లక్ష్మీరెడ్డి – సుభాషిని దంపతుల కుమారుడు కోడలు కోడూరు నరేష్ కుమార్ రెడ్డి – మాధురి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో సోమవారం బుడంగుంట గిరిజన కాలనీలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర, దాతలు కోడూరు లక్ష్మీరెడ్డి – సుభాషిణి దంపతులు పాల్గొని, పేదలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా నేటిదాతలు లక్ష్మిరెడ్డి – సుభాషిణిలు మాట్లాడుతూ తమకుమారుడు కోడలు నరేష్ కుమార్ రెడ్డి – మాధురిల పెళ్లిరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలియజేశారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు సూచనలు

ప్రజాశక్తి-సంగం : సంగం బస్టాండ్ సెంటర్లో ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు సోమవారం ఆర్‌టిసి డిఎం కరీంనిషా పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రయాణికులు ఆర్‌టిసిలో ప్రయాణించడం వల్ల సురక్షితంగా గమ్యాన్ని చేరుకుంటారని తెలిపారు. ఆర్‌టిసిలో ప్రయాణించిన వారికి బీమా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ప్రయాణికులతో నడుచుకునే విధానంపై డ్రైవర్లు, కండక్టర్లతో చర్చించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని కోవూరుపల్లి ప్రాథమిక కేంద్ర పరిధిలోని కడనూతల సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మండల వైద్య అధికారిణి సీమతపస్సు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పిసి కోఆర్డినేటర్ డాక్టర్ దయాకర్, కావలి డిఎంహెచ్ఒ పి.విజిత పాల్గొని సచివాలయంలో తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక కేంద్రం సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుండాలమ్మపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-కొడవలూరు : 'మండలంలోని గుండాలమ్మపాలెంలో కొడవలూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలోని ఓ వ్యక్తి పక్షవాతం సమస్యతో బాధపడుతుండగా వారి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలిచ్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఓ మహిళకు కుష్ఠ అనుమానిత లక్షణాలుండగా వారి ఇంటికి వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. హెచ్ఎస్ ఎన్.సుజాత, ఎంఎల్‌హెచ్పీ షేక్ రషీదా, హెచ్‌ఎలు షఫీ ఉద్దీన్, వైద్యాధికారిని గీతాషాలిని, విజయలక్ష్మి, ఆశ కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పట్టణనికి చెందిన టీడీపీ నేత కోవూరు నియోజకవర్గం యువత అధ్యక్షులు బెల్లం కొండ విజయకుమార్‌తో కుటుంబ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి సమక్షంలో వైసీపీ లో చేరారు. విలేకర్ల సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. విజయమంచి నాయకుడని రజిత్ కుమార్ రెడ్డి సహకారంతో వైసీపీ లో చేరడం మంచి పరిణామం అని అన్నారు. పార్టీలో చేరే వారిని స్వాగతం పలు కుతామన్నారు. ఇంకా కొందరు టీడీపీ నాయకులు కోవూరు లో ఉన్నారని వారు కూడా త్వరలో వైసీపీ తీర్థం పుచ్చుకుంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు, దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, ఎఎంసి చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ, పార్వతి, జెడ్‌పిటిసి శ్రీలత, కాటం రెడ్డి దినేష్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులు రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యతో ప్రయోజనం

ప్రజాశక్తి-కొడవలూరు : డిజిటల్ విద్య విధానాలకు ఎంతో ప్రయోజనకరమని ఎంఇఒ వసంత కుమారి తెలిపారు. మండలంలోని నార్త్ రాజుపాలెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, సంగం, మండలాలలోని 160 మంది ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్ పై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్ విభాగధిపతులు ప్రవీణ్ కుమార్, కెపి నాగేంద్ర ప్రఫుల్ కుమార్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఒ జి సుధీర్ బాబు ఆ కళాశాల ప్రిన్సిపల్ పి కుమార్ బాబు నాతో రాజుపాలెం హై స్కూల్ హెచ్ఎం డి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నెక్లెస్ బహూకరణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : చెన్నయ్ వాస్తవ్యులు నాయుడు ఆశ్రితరెడ్డి కామాక్షితాయి అమ్మవారికి సుమారు 39 గ్రాములు విలువైన బంగారు నెక్లెస్‌ను సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ శ్రీ పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు దాతలకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. దాతలను శ్రీవార్ల శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కూరగాయల ధరలను అదుపు చేయాలి

ప్రజాశక్తి-కావలి

విపరీతంగా పెరిగిపోయిన కూరగాయల ధరలను వెంటనే అదుపు చేయాలని, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కావలి రైతు బజార్‌లో సిపిఎం నాయకులు సోమవారం సందర్శించి, అక్కడున్న ఎస్టేట్ అధికారి బి.స్వరూపను కలిసి, కూరగాయల ధరలు పెరుగుదలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కూరగాయలు ధరలు వారం రోజుల నుండి ఆకాశమంటుతున్నాయన్నారు. కూరగాయలు ధరలు టమోటా రూ.96, పచ్చిమిర్చి రూ.100, బీన్సు చిక్కిళ్లు రూ.100, చిక్కుళ్లు రూ.90, బీరకాయ రూ.70 ఈ ప్రకారం అన్ని కూరగాయల రేట్లు పెరిగి ఉన్నాయన్నారు. ఈ ధరలతో ప్రజలు కొని తినలేని పరిస్థితి ఉన్నదని ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వం అధికారులు విఫలమవుతున్నారన్నారు. గత శనివారం ఒక్కరోజు మాత్రం టమోటాలు సబ్సిడీ రేటుకు రూ.50లకు కొంత మందికి మాత్రమే ఇచ్చి, చేతులు దులుపుకోవడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికే అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఈ

కావలిలో మార్కెట్‌ను సందర్శిస్తున్న సిపిఎం నాయకులు

పరిస్థితుల్లో కూరగాయలు ధరలు పెరిగినందున ఇంకా ప్రజలు ఇబ్బంది పడాల్సివస్తుందన్నారు. ప్రజలు ఇబ్బందులు ప్రభుత్వానికి అధికారులకు వారి గోడు పట్టటం లేదన్నారు. ఇలా ప్రజలపై భారాల మీద భారాలు మోపుతుంటే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పెరిగిన కూరగాయల ధరలను వెంటనే అదుపు చేయాలని, పెరిగిన కూరగాయలను ప్రభుత్వం సబ్సిడీ రేటుకు ప్రతిరోజూ ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.క్రిష్ణ మోహన్, జి.మధుసూదనరావు, సిఐటియు నాయకులు టి.రత్నం, డివైఎఫ్ఐ నాయకులు మదన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : విపరీతంగా పెరిగిపోయిన కూరగాయల ధరలను వెంటనే నియంత్రించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుళ్లూరు గోపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేద మధ్యతరగతి ప్రజలు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఉందని, ఈ పరిస్థితుల్లో నిత్యవసర వస్తువులతో పాటు కూరగాయల రేట్లు ఆకాశాన్ని అందుతున్నాయన్నారు. ఈ ధరలతో ప్రజలు కొని తినలేని పరిస్థితి ఉన్నదని ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వం అధికారులు విఫలమవుతున్నారన్నారు. గత శనివారం ఒక్కరోజు మాత్రం టమోటాలు సబ్సిడీ రేటుకు రూ.50లకు కొంత మందికి మాత్రమే ఇచ్చి, చేతులు దులుపుకోవడం చాలా అన్యాయమన్నారు. పెరిగిన కూరగాయలను ప్రభుత్వం సబ్సిడీ రేటుకు ప్రతి రోజు ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

భోజన ఏర్పాట్లు అభినందనీయం

ప్రజాశక్తి-కావలి

ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్ భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని రెడ్డి జన సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంకు వచ్చిన అర్జీదారులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, భోజన పొట్లాలు, మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. స్థానిక "లేక్ వ్యూ హోటల్" యజమాని కున్నం వెంకట కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్డిజన సంక్షేమ సంఘ నాయకులు కూరపాటి వెంకట కృష్ణారెడ్డి, బుర్లా రఘుకుమార్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-కావలి

ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో వైసిపి నాయకులు అమరా వేదగిరి సుబ్బారాయుడు గుప్తా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జగనన్న సురక్ష" కార్యక్రమం గురించి వార్డులోని బుట్టా వారి వీధికి చెందిన వారి ఇళ్లకు వెళ్లి సురక్ష పథకం ద్వారా పొందే లాభం గురించి వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ వారికి ఏమేమి సర్టిఫికెట్లు కావాలో.. అవన్నీ తెలుపుతూ బుట్టా వారి వీధి వలంటీర్ రసపుత్ర మౌలిక, విఆర్ఒ శ్రీనివాసులు నోట్ చేసుకున్నారు. బుట్టావారి వీధిలోని ప్రజలు అడిగిన వారందరికీ ఏమేమి డాక్యుమెంట్లు కావాలో విఆర్‌ఒకు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తాతో పాటుగా సచివాలయం కన్వీనర్ పెసల వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, విఆర్ఒ శ్రీనివాసులు, శానిటైజేషన్‌కు సంబంధించి ఏడుకొండలు, డేటా ఆపరేటర్ రాజేష్, గృహ సారథులు దారా సునీత, భైరవరపు సునీత, గురజాల రవి, పసుపులేటి నరసింహ, వార్డు వైసిపి నాయకులు రాఘవేంద్ర, చిల్లర నరసింహారావు, తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, సిహెచ్.వెంకటకృష్ణారెడ్డి, టి.సృజన, పి.వాణి, కె.శ్రీనివాసులు, కె.మస్తానయ్య, పి ఎండి రఫీ బదిలీపై వెళ్లడంతో బండగానిపల్లి సర్పంచ్ లక్కు రమణమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.సుందర్ రామిరెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు సర్పంచ్ బహుమతులు అందజేశారు. పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ప్రతి తరగతికి ఒక కూల్ వాటర్ క్యాన్ ప్లాస్టిక్ స్టూల్ అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

భవన నిర్మాణాలకు చేయూతనివ్వండి

ప్రజాశక్తి-కావలి

కావలి డివిజన్లో దళితులు, గిరిజనులు వివాహం చేసుకోవడానికి ఇతర కార్యక్రమాలు చేసుకోవడానికి కమ్యూనిటీ హాల్స్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడున్న కళ్యాణ మండపాల్లో లక్షల రూపాయలు బాడుగ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, కావున కావలి డివిజన్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి చేయూతనివ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్లో ఒక్కటి కూడా అంబేద్కర్ భవనం గానీ కమ్యూనిటీ హాల్ గానీ లేకుండా చేశారన్నారు. అన్ని డివిజన్లలో ఉన్నప్పటికీ కావలిలో ఉద్దేశ పూర్వకంగానే లేకుండా చేశారని తెలియజేశారు. బోగోలు మండలంలోని చెంచులక్ష్మీపురం దగ్గర సర్వే నెంబర్ 461/1 బిలో గ్రామకంఠం స్థలం ఉందని, ఆ స్థలంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పేదలకు అన్నదానం చేయడానికి అన్నదాన సత్రం నిర్మాణానికి స్థలం కేటాయిస్తే, తమ సొంత నిధులతో నిర్మించుకోగలమని ఆయన తెలియజేశారు. దళిత, గిరిజన విషయాలకు వచ్చే సరికి స్థానిక శాసనసభ్యులు గానీ, ఇతర ఏ నాయకుడు కూడా తమకు సహాయం చేయడం లేదని పేర్కొన్నారు. గతంలో కూడా ముసునూరు ప్రాంతంలో ఎకరా

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూమి తీసిపెట్టినప్పటికీ గతంలో విశ్రాంత తహశీల్దార్ పట్టాల తోటి దొంగ పట్టాలు సృష్టించి, స్థానిక రెవెన్యూ అధికార్ల సహకారంతో అధికార పార్టీ నాయకులతో ఆ స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారని తెలియజేశారు. గతంలో పనిచేసిన అధికారులు డూప్లికేట్ పట్టాలతో మందాటి చెరువు దగ్గరి నుంచి, మొత్తం బినామీలతో ఆక్రమించుకొని, వ్యాపారాలు చేస్తున్నారని తెలియజేశారు. అంబేద్కర్ భవనానికి తీసి పెట్టిన భూమికి దొంగ పట్టాలు సృష్టించి, ఆక్రమించుకొని అనుభవిస్తున్నారన్నారు. అధికార పార్టీ అండ ఉంటే ఏమైనా చేయవచ్చా అని ప్రశ్నించారు. కాబట్టి చెంచులక్ష్మీపురం స్థలంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జయరాజ్, యోహాను, మాల్యాద్రి, కాకి ప్రసాదరావు, మొగిలి కల్లయ్య, షేక్. రఫీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

ఎంఎల్ఎపై మాలేపాటి మండిపాటు

ప్రజాశక్తి-అల్లూరు

కా వలి నియోజక వర్గ ఎంఎల్ఎ రామి రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై టిడిపి కావలి నియోజక వర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు తీవ్రస్థాయిలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా పోలేరమ్మ దేవస్థానంలో ఉదయగిరి మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రకోట, బోగోలులో పట్టపగలే గ్రావెల్ తరలిస్తూ ఉంటే ఎంఎల్ఎకు సిగ్గు ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ ప్రభుత్వంలో దోపిడీలు దౌర్జన్యాలు అధికంగా ఉన్నాయన్నారు. 7న జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగలం పాదయాత్ర అల్లూరు మండలంలోకి వస్తున్నట్లు తెలియజేశారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులరెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, రామిశెట్టి కృష్ణ చైతన్య తదితరులున్నారు.

హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

సోమశిల హైలెవల్ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నందవరం గ్రామ సచివాలయం కార్యదర్శి రమేష్‌కు సిపిఐ నాయకులు మహబూబ్ బాషా, రామసుబ్బయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్టప్రాంతంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. గత 10ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వాలు సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టారన్నారన్నారు. అప్పటి నుండి కెనాల్ పనులు మంద కొడిగా సాగుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోమశిల ఉత్తర కాలువ పనులు పూర్తి చేసి మండల రైతులకు సాగు, తాగు నీరు అందించాలన్నారు. వాణిజ్య పంటలతో ఆహార భద్రతకు ముంపు పొంచి ఉందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక రుణభారంతో కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలలో దేశం 3వ స్థానంలో ఉందని, వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులేనని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్

వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతుల పండించిన పంటలకు గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ తరహాలో ప్రతి రైతుకు రూ.10వేలు సాయం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. కౌలు రైతులకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేసి 50 సంవత్సరాలు దాటిన రైతులకు ప్రతి నెల రూ.10 వేలు పింఛన్ అందించాలని కోరారు.

వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-ఉదయగిరి

సంజీవ్‌రాజు పల్లి గ్రామానికి చెందిన సంజీవ్‌రాజుపై అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు మద్యం మత్తులో దాడి చేశారని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి గ్రామంలో పెద్దలతో కలిసి మాట్లాడుతున్న సంజీవరాజు అప్పుటికి పూటుగా మద్యం సేవించి ఉన్న రామాంజనేయులు దుర్భాషలాడుతూ అసభ్యకర పదాలతో దూషించి దాడి చేశాడని తెలిపారు. తనపై జరుగుతున్న దాడిని అడ్డుకోకపోయినా తన కుటుంబ సభ్యులతో పాటు ఎస్.అంజమ్మతో పాటు మరో ముగ్గురుపై విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. గ్రామస్తులు చూస్తూ ఉండిపోయారు తప్ప అతని ఆగడాలను ఎదిరించలేకపోయారని వాపోయారు. 108 వాహనాన్ని ఆశ్రయించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందేందుకు చేరామన్నారు. అకారణంగా తనపై దాడి చేసిన రామాంజనులపై చటపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వరికుంటపాడు

అనారోగ్యంతో బాధపడుతున్న పత్రి గురుబ్రహ్మం (71) గ్రామ పొలాల్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పత్రి గురుబ్రహ్మం (71) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగుమందు సేవించాడు. చికిత్స నిమిత్తం అతన్ని హుటాహుటిన పామూరు ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేదల అభివృద్ధే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి-అల్లూరు

రాష్ట్రంలోని పేదల అభివృద్ధి, వారు కన్న కలలను నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద దయాకర్ రెడ్డి లేఅవుట్లకు సంబంధించి సుమారు 434 ఇంటి పట్టాలను మహిళలకు పంపిణీ చేశారు. ముందుగా వారి ఇరువురు రాజుల వీధిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆ నేతలు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి విరివిగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. గత తెలుగుదేశం హయాంలో అభివృద్ధి శూన్యమని జన్మభూమి కమిటీల పేరుతో అంతా దోచుకోవడం తెలిసిందేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 175కు 175సీట్లు సాధించి తీరుతామన్నారు. ప్రతి కుటుంబ

మహిళలకు పట్టాలు అందజేస్తున్న రామిరెడ్డి, బిఎంఆర్

అభివృద్ధి చెందాలనే దృక్పథంతో జగనన్న విద్యార్థులకు పెద్దపీట వేస్తూ అన్ని సమకూరుస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు నీలం సాయికుమార్, ఎఎంసి వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జెడ్‌పిటిసి చలంచర్ల వేణమ్మ, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీదేవి, నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ తదితరులున్నారు.

దళితుల నిరసన

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం దళితులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు పొంగులూరు ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌రావణ్‌పై దుండగులు జరిపిన కాల్పులను తీవ్రస్థాయిలో ఖండించారు. యోగి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి దళితులపై దాడులు అధికమయ్యాయని మండిపడ్డారు. అనేక హత్యలు, అత్యాచారాలతో ఆ రాష్ట్రంలో అరాచక శక్తులు తాండవిస్తున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. గతంలో యోగి ఆజాద్‌ను అనేక నెలలు జైల్లో ఉంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్ రాజ్ తదితరులున్నారు.

కుష్ఠువ్యాధి నివారణకు కృషి

ప్రజాశక్తి-కావలి

దేశంలో కుష్టువ్యాధి రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వాలు నిరంతరం కృషి చేయాలని స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవ సలహా దారులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ముసునూరు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో ఆశ కార్యకర్త నాగమణి ఆధ్వర్యంలో ఇంటి ఇంటి సర్వే నిర్వహిస్తూ, స్పర్శ లేని మచ్చలు, ఇతర మచ్చలపై వివరాలు సేకరిస్తున్న సందర్భంగా జరిగిన కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ శరీరంపై వచ్చే మచ్చల పైన ముఖ్యంగా స్పర్శ లేని మచ్చలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశవర్కర్ల దృష్టికి ఆరోగ్య విషయాలు ఎప్పటికప్పుడు వారి ద్వారా ఆరోగ్య సలహాలు తీసుకోవాలని కోరారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పట్టణంలోని నగర అభివృద్ధిలో భాగంగా మూడో వార్డులో ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం హామీ మేరకు కౌన్సిలర్ అందే ప్రత్యూష ఇస్కపాళెం గ్రామంలో ఆదివారం నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల యువజన అధ్యక్షులు చిరమన సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు నెంబర్, వైసిపి నాయకులు బిట్రగుంట సురేష్,రంజిత్, మైనారిటీ రూరల్ నాయకులు ఫయాజ్ తదితరులున్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలో పలు ప్రాంతాలలో గురు పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయ ప్రాంగణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో అర్చకులు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో మూల విరాట్‌కు భక్తులతో సామూహిక పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లోనే సాయినాథుని మందిరంలో చేసిన పూలంగి సేవ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం స్వామివారి ఉత్సవాలు మూర్తిని పల్లకి సేవలో ఊరేగించారు. ఆలయాలు విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

ప్రజాశక్తి-సంగం : మండల కేంద్రంలోని సాయినగర్‌లో వెలసిఉన్న సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సాయివ్రతాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోటీలను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు

ప్రజాశక్తి-బిట్రగుంట : పాత బిట్రగుంట గ్రామం ద్వారకా నగర్‌లో వెలసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు సాయిబాబా మందిరం వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు ఎడ్ల బండ లాగు పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీద మస్తాన్ రావు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయి బాబా మందిరంలో ఎడ్లబండ లాగు పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించి గ్రామంలో పండగ వాతావరణం కల్పిస్తున్నారని షిరిడి సాయిబాబా ఆశీర్వాదం అందరికీ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. బోగోలు బజార్ రాజా వీధిలో వెలసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా అమరాచారి టబుల్ ట్రస్ట్ సహకారంతో ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలను అందజేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వనాథరావుపేట పంచాయితీలో ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం కమిటీ సభ్యులు సభ్యులు పేట శ్రీధర్, శివ, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శశి కుమార్, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.